# అయినా ఒకనాడు నామగారోడు



రాధారాఘవ్

మల్లెపూలు తలలోపెట్టుకొంటూ గడియారంకేసి చూసింది శారద.

గడియారం అయిదున్నర చూపిస్తోంది. ఈ పాటికి ట్రయిను వచ్చేసి ఉంటుంది అనుకుంది.

సాయంత్రం మెయిల్లో వస్తున్నాననీ, తన కిష్టమైన తెల్లజరీ చీరలో, తల నిండా మల్లెలతో ఎదురు చూస్తూండవలసిందనీ వ్రాశాడు శేఖరం.

పెళ్ళయ్యాక మొదటిసారి రావడం. అతన్ని తీసుకురావడాన్కి వాళ్ళన్నయ్య స్టేషనుకెళ్ళాడు. ఇంకొంచెం సేపట్లో వచ్చేసేయొచ్చు.

కాళ్ళు వీధిలోకివెళ్ళి నిలబడమని తొందర చేస్తున్నా, ఒకచోట స్థిరంగా నిలబడనీకుండా కంగారు పెడుతూ మారాం చేస్తోన్న మనస్సుని, అవతలి కెళ్ళి చూద్దామని ఉరకలేస్తోన్న కళ్ళనూ మభ్య పెడుతూ అక్కడే నిలబడిపోయింది శారద.

—ఇంకేమైనా ఉందా? తను వీధిలోకి వెళ్ళడం చూసిందంటే వదిన చంపేస్తుంది. 'అబ్బ. అప్పుడే ఎంత తొందరొచ్చేసింది; పెళ్ళయి నాలుగునెలలు కాలేదు' అంటూ ఏడిపించేయదూ? ... ఇందాక పిల్లలు దెబ్బలాడుకుంటున్నారని, వీధిలోకెళ్తే—ఎక్కడ్నించి చూసిందో, 'ఇంకా టైము చాలా ఉంది మరదలా! ఇప్పట్నుంచీ వీధికి కాపలా కాయకు' అంటూ కేకపెట్టింది.

శరీరం యిక్కడేఉన్నా, మనస్సును స్టేషనుదాకా పంపేసి, చెవులు వీధికి అప్పగించి, కోటికోరికలు నింపుకున్న మనస్సుతో, ఒళ్ళంతా కళ్ళుచేసుకు ఎదురు చూస్తోంది—భర్త రాకకోసం శారద.

కాలింగ్‌బెల్ టింగుమంది.

ఏమరుపాటుగా ఉన్న శారద ఉలిక్కిపడింది

'అక్కా! బావగారొచ్చేశారు' అంటూ వాళ్ళ తమ్ముడు ఒక్కకేక పెట్టి, పరగెత్తుకెళ్ళి తలుపు తీశాడు.

అతని రాకకోసం ఎదురుచూస్తోన్న శారదకు, ఒక్కసారిగా గుండెల్లోకి వేడి నెత్తురు వచ్చినట్లయింది. రెండడుగులు ముందుకు వేసినదల్లా చటుక్కున ఆగిపోయింది,

హాల్లోంచి మాటలు వినపిస్తున్నాయి.

'రండి!' అంటూ ఎదురెళ్ళి, సాదరంగా ఆహ్వానించి క్షేమ సమాచారాలడుగుతోంది

తల్లిగారి వాళ్ళన్నయ్య సామాన్లు లోపల పెట్టిస్తున్నాడు.

అవతల గదిలో క్లయింట్లతో కూర్చున్న విశ్వనాథంగారు కూడ, 'వచ్చేశారేమిటి? — ఏరీ?' అంటూ హడావుడిగా యివతల కొచ్చారు కళ్ళజోడు సవరించుకుంటూ.

'ప్రయాణం సాఫీగా జరిగిందా? ఇంటి దగ్గర అందరూ క్షేమమేనా?' అంటూ కుశలమడిగారు అల్లుడ్ని.

'బాగా అలిసిపోయొచ్చారు; ఆ తర్వాత మాట్లాడుకుందాంలెండి. ముందు స్నానం చేసి, కొంచెం విశ్రాంతి తీసుకోండి.' అంటూ భార్యకేసి తిరిగి, 'ఏదే అమ్మాయి? ముందు అబ్బాయికి కొంచెం కాఫీ పంపు' అనేసి వెళ్ళిపోయారాయన.

'ఆ గదిలోకి వెళ్ళండి బావగారూ! నాకు ఫుట్‌బాల్ మేచ్‌కి టైమయింది; నేను మళ్ళీ వస్తా' అంటూ నిష్క్రమించాడు అన్నగారు.

తను తెచ్చిన బిళ్ళలు బిస్కట్లు, పిల్లలచేతుల్లో పెట్టి, గదిలోకి వచ్చాడు శేఖరం.

ఇక్కడ శారద ఉవ్వెత్తుగా లేస్తోన్న ఆనందతరంగాలను అణచి పెట్టుకుంటూ నానా అవస్థా పడుతోంది. ఎక్కడ నిలబడాలో ఏంచేయాలో అర్థంగాక, కాళ్ళు భూమికి అతుక్కుపోయినట్లుగా ఉండిపోయింది అక్కడే

ఒకసారి చూడాలని దగ్గరగా వెళ్ళి మాట్లాడాలని మనస్సులో ఉన్నా —ఏదో తెలిని సిగ్గు, నిలబడ్డా, కూర్చున్నా ప్రొద్దుట్నించి వేళాకోళాలు పట్టిస్తున్న వదినగారి మాటల్లూతో సంకోచిస్తూ అక్కడే ఉండిపోయింది.

'మమ్మల్ని తిట్టుకుంటూ ఎంతసేపు నిలబడుంటావుగాని, ముందీ కాఫీ తీసుకెళ్ళి, మా తమ్ముడిగారికిచ్చిరా' అంటూ వచ్చింది వాళ్ళ వదిన.

'మీ మాటలు విననులెండి. త్వరగా మాట్లాడుకోండి. మరేం ఫరవాలేదు; నేను వంటింట్లోకి వెళ్ళిపోతున్నాను' అంటూ వెళ్ళిపోయిందావిడ.

సిగ్గుతో ఎర్రబడ్డ ముఖంతో, ఒళ్ళంతా సన్నగా కంపిస్తుండగా, అడుగులో అడుగేస్తూ, భర్త ఉన్న గదిలోకి వచ్చింది శారద.

నీటుగా సర్ది ఉన్న గదిని, డ్రెస్సింగ్ టేబులుమీదున్న భార్య ఫోటోను చూస్తూ కూర్చున్న శేఖరం, శారదను చూడగానే చటుక్కునలేచి దగ్గరగా వచ్చాడు.

'కాఫీ తీసుకోండి' అంటూ కప్పు అందించింది శారద.

'ఊఁహూ. కాఫీకోసం రాలేదింత దూరమూ. ముందు కావాల్సింది మరొకటి: తర్వాతే కాఫీ' అంటూ ఒకచేత్తో ఆమెను దగ్గరగా తీసుకుని, తలుపులు దగ్గరగా వేశాడు.

'ఒద్దు ఒద్దు అందరూ నవ్వుతారు' అంటూ కంగారుగా వారించబోయింది శారద.

'మరేం ఫర్వాలేదులే. ఆ నవ్వేవాళ్ళకు మాత్రం మనలాంటి తొందర లేదంటావా?' అంటూ కప్పుతీసి, టీపాయ్‌మీద పెట్టి, రెండు చేతులతోనూ చుట్టేశాడు.

శారద అతని నుంచి విడిపించుకుంటూ, 'ముందు కాఫీ తీసుకోండి; చల్లారిపోతుంది' అంది.

తర్వాత కాఫీ త్రాగుతూ అన్నాడు శేఖరం.

'వచ్చేశానమ్మాయ్! పండక్కు తప్పకుండా రండి! రండి! అంటూ పిలిచావుగా. నీ కోరిక తీర్చేశాను. మరి నా కోరికేం చేస్తావో?'

'మీ కోరికేమిటి?' అంది శారద తెల్లబోతూ.

'అదే. మొన్న ఉత్తరంలో వ్రాయలేదూ?— మా ఫ్రెండ్సందరూ స్కూటర్స్ వెనుక పెళ్ళాలనేసుకు తిప్పుతూంటే, నాక్కూడా ఎప్పుడలా నిన్ను కూర్చోబెట్టుకు తిరగాలా అనుంది.'

గుండెలమీంచి పెద్దబరువు దింపినట్లయింది శారదకి. 'ఓస్. ఇంతే గదా! ఇంకా ఏదో అనుకున్నాను' అంది.

'అన్నట్టు యింకో గుడ్ న్యూస్.'

'ఏమిటది?'

'నా ఫ్రెండు లక్ష్మీపతి అని చెప్తూంటానే, వాడికి వాళ్ళ మామగారు మొన్నే స్కూటరు కొనిచ్చాడు. మొత్తానికి మన వాడు సాధించాడులే......ఎంత రభస జరిగిందని!— వాళ్ళ మామగారు మహా ఘటికుడు. చస్తే డబ్బు వదలడు ఆఖరికి ఎలా అయితేనేం, కొన్నాళ్ళు బెదిరించి, అత్తారింటికి వెళ్ళడం మానేశాక కొనిచ్చాడు మహానుభావుడు.

అదే అడగ్గానే యిచ్చేస్తే ఎంత బాగుండను! ఏ గొడవా లేకే పోనుగదా. పెళ్ళాం ఉత్తరాలు వ్రాస్తే వాడు సమాధానాలివ్వకపోవడం, ఆ అమ్మాయి గాభరా యెత్తిపోయి ఏడుస్తూ కూర్చోవడం, చాలా ఫార్సు జరిగిందిలే.

వాళ్ళు మాత్రం ఏళ్ళకాలం పెడతారా? వీళ్ళుమాత్రం అడగబోయి అడుగుతారా? ఏదో క్రొత్త ల్లుడు!—అచ్చట్లు ముచ్చట్లు అన్నారు.

పాపం! రాజు మామగారు మాత్రం చాలా మంచివాడులే. 'క్రొత్త దంపతులు సరదాగా తిరగండని' పెళ్ళిలోనే స్కూటరు కొనిచ్చేశాడు.'

భర్త చెప్పేదంతా దేనికి నాందీ హో అర్థంగాక తెల్లబోయి చూస్తోంది శారద.

శేఖరం దగ్గరగావచ్చి, భార్య బుగ్గమీద చిటికవేస్తూ అన్నాడు. 'మంచిదానివిగా మరి మీ నాన్నగారితో చెప్పి, నా కోరిక కూడా తీరిపిస్తావుగదూ? లేకపోతే ఫ్రెండ్సందరిముందూ. ఎంతో అవమానంగా ఉంటుంది. నాకు...అఫ్‌కోర్స్! ఇంటికి పెద్దకూతురువాయె; ఆమాత్రం ముద్దు ముచ్చటా వాళ్ళకూ ఉండక పోదనుకో.'

భర్త మనస్సులో ఉన్న కోరిక పూర్తిగా అర్థమయేసరికి, శారదకు నెత్తిమీద ఎవరో సుత్తితో కొట్టినట్లయింది.

ఆప్యాయంగా మాట్లాడుతూ, అనురాగాన్ని చిందిస్తూ, చల్లగా చెప్పిన ఆ వార్త ఆమెను భయకంపితురాలిని చేసింది.

అంటే ???— అంటే పరోక్షంగా తనను బెదిరిస్తోన్నట్టేగదా.

అతనిగురించి చెప్పడంలో యితని ఉద్దేశ్యం?— పండుగ బహుమానంగా స్కూటరివ్వకపోతే, లక్ష్మీపతిలా నేనూ అలా చేయాల్సి వస్తుందని చెప్పటమేగా దానర్థం.

ఆమె ముఖం తెల్లగా పాలిపోయింది, అంతవరకూ గులాబీలు పూయించిన ఆమె చెక్కిళ్ళు, రక్తంలేనట్లు అయిపోయాయి. శరీరమంతా ఎక్కడలేని నిస్సత్తువా వ్యాపించినట్లయింది.

.. కన్నులముందున్న సుందరస్వప్నం చెదిరి

పోతోన్నట్టు, తను కట్టుకున్న ఆకాశ హర్మ్యాలు మొదలంటా కూలిపోతోన్నట్టు అనిపించ సాగింది.

ఎవరైతే తన జీవిత సర్వస్వం అనుకుందో, ఏ వ్యక్తయితే తనకోసం తహతహలాడిపోతూ, యింతదూరం రెక్కలు కట్టుకొచ్చి, తన సన్నిధిలో వ్రాలాడని మురిసిపోయిందో, 'ఇతను నావాడు' అనుకుని, ఎవర్ని చూసి యిన్నిరోజులుగా గర్వపడుతోందో—అతని విషయంలో తను పొరబడిందా? కేవలం అదంతా తన భ్రమేనా?

అతను వచ్చింది తనకోసం కాదన్న మాట. ఇంతదూరం పరుగెత్తు కొచ్చింది, యీ కోరిక తీర్చుకోడం కోసమా? అతనికి స్కూటరే కాని తను అక్కర్లేదా? దాని తర్వాతేనా తను? ఇంతవరకూ అతను తనమీద చూపిన ప్రేమ, ఆ తహతహ అంతా బూటకమేనా? అదికూడా తన కోరిక తీర్చుకోడం కోసంచేసిన నటనేనా? ఇదేనా తను భర్తనుంచి ఆశించినది???'—ఆమె మనస్సంతా గజిబిజి అయిపోతోంది.

హృదయం నిండుగా అనురాగాన్ని నింపుకుని, అందులో భర్త మూర్తిని ప్రతిష్ఠించుకుని, అంతదాకా అతనే తన సర్వస్వం అనుకున్న శారదకు, ఆక్షణంలో అతను ఎంతో పరాయివాడిలా, తనకూ అతనికీ మధ్య ఎంతోదూరం ఉన్నట్టూ అనిపించసాగింది.

అప్పటివరకూ అతని సన్నిధిలో స్వర్గసుఖాలు రుచిచూసిన శారదకు, ఎప్పుడు అక్కడ్నుంచి లేచిపోదామా అనిపించసాగింది. అంతదాకా తియ్యగా వినిపించిన అతని పలుకులు ములుకుల్లా గుచ్చుకోవడం మొదలెట్టాయి.

అతని మాటల ప్రభావంనుంచి తేరుకుని, మామూలుగా ఉందామని ఎంత ప్రయత్నించినా ఉండలేక పోయింది.

అతని ప్రేమ, అనురాగం, తియ్యటి మాటల వెనుకనుంచి తొంగి చూస్తోన్న దాగున్నకోరిక ఆమెను నిలవనీయడంలేదు.

ఎంత అసమంజసమైన కోరిక! స్కూటరంటే మాటలేనా? వేలకువేలు కట్నాలు పోసింది కాక, యింతంత బహుమానాలు ఎక్కడ్నుంచి తెచ్చివ్వగలరు? తండ్రి ప్రాక్టీసు చూస్తే బాగా పడిపోయింది. అన్నగారి సంపాదనతో సంసారం జరుగుతోంది. ఏటా తిండిగింజలకు లోటు లేకుండా జరిగిపోయే పొలం అమ్మేసి తనకు పెళ్ళిచేశారు. ఇంకా తమ్ముళ్ళ చదువు, చెల్లెలి పెళ్ళి, అన్నగారి పిల్లల భవిష్యత్తు—ఎన్నో ఉన్నాయి.

ఇలాంటిస్థితిలో యింటిసంగతులు తెలుసున్నతనే, ఏముఖం పెట్టుకు వాళ్ళనడుగుతుంది? భర్త ఎలా తన నర్థం చేసుకుంటాడు?

భగవంతుడా! ఆడపిల్లకు యిది మరో పరీక్షా?

తనకోసం ఎంతో ఖర్చుపెట్టి గుండెలమీద కుంపటి దించుకున్న తల్లిదండ్రుల దగ్గర, కావాలని అడిగితీసుకునే హక్కు కోల్పోయి నట్టయింది. క్రొత్తగా భర్త జీవితంలో అడుగు పెట్టడంవల్ల, అటు అతనిదగ్గరా పూర్తి చనువు లేదు.

ఇలాంటి సమయంలో ఎవరికేమని చెప్పగలదు? ఆడపిల్లలా జన్మించేకంటే, అడవిలో మానయి పుట్టినా బాగుండిపోను గదా. అని కుమిలిపోసాగింది.

శేఖరం ఏవో కబుర్లు చెప్తున్నాడుగాని, శారద చెవులు పనిచేయడంలేదు. తలంతా గిర్రున తిరుగుతోంది.

ఓరకంట ఆమె అవస్థ గమనిస్తూనే, ఏమీ ఎరగనట్టు ఊరుకున్నాడు శేఖరం.

ఆ రాత్రి భార్యను దగ్గరగా తీసుకుంటూ, 'స్కూటరు విషయం మీ యింట్లో చెప్పావా? ఏమన్నారూ?' అనడిగాడు.

అతనలా అడుగుతూంటే, యిద్దరి మధ్యా ఉన్నదూరం, మరింత పెరుగుతోన్నట్టు, అనిపించింది శారదకు.

—ఎవరి కౌగిట్లో సర్వం మరిచి ఒదిగిపోయేదో, ఎవరి ఆప్యాయమైన పలుకులతో మనస్సు పరవశించి పోయేదో ఆ వ్యక్తేనా యితను?

కాదు, కాదు. ఈ శేఖరం వేరు. యీ శేఖరం వేరు. 'శారూ!' అంటూ ఆప్యాయంగా చూస్తూ, అనురాగాన్ని చిందించే ఆ శేఖరానికి, 'ఇప్పుడు స్కూటరు యిప్పిస్తావుగదూ?' అంటూ తియ్యగా మాట్లాడుతూనే నిర్బంధిస్తోన్న యీ శేఖరానికి అసలు పోలికేలేదు!

ఇన్నాళ్ళూ తన ప్రేమస్వరూపాన్నే చూపించిన భర్త, యీనాడు తనలోని మరోరూపం కూడా చూపిస్తున్నాడు.

పన్నీటిజల్లులు కురిపించే అతని సన్నిధిలో, అగ్నిజ్వాలల్లో ఉన్నట్టనిపించే సరికి, అతనినుంచి విడిపించుకుని, కొంచెం యివతలకు జరిగింది శారద.

కాని తప్పదు. అతను భర్త. తను భార్య. ఈ బంధం తెంచుకుంటే తెగేది కాదు. మనస్సులు దూరమయ్యాక, మనుషులు చిగురించడం కష్టం. పంతాలకు, పట్టుదలలకు పోయినా, నష్టపోయేది తనే గాని భర్త కాదు.

ఉన్నదంతా ఖర్చుచేసి, ఆడపిల్ల పెళ్ళి చేసిన తల్లిదండ్రులకు, ఆ కూతురు, నాలుగుకాలాలపాటు సుఖంగా ఉంటేనే వాళ్ళకు ఆనందంగాని, గొడవలతో ఉంటే కాదు.

కోపంతో తను రెండంటే, దానికి అతను రెండు జవాబిస్తాడు, యిద్దరి మధ్యా ఘర్షణ మరింతదూరం పెరగడమే గాని, ఏం లాభంలేదు అనుకుంది శారద.

తను యీనాటి ఆడపిల్ల. నవసంస్కారాల మధ్యనుంచి వచ్చిన వ్యక్తి. తన తొందరపాటుతో భర్తకు కోపం తెప్పించి, తల్లిదండ్రులకు మనఃక్లేశం కలిగించే కంటే, స్త్రీగా ఓర్పువహించి, భర్తకు నచ్చచెప్పి చక్కబర్చుకోవడం తన కర్తవ్యం.

ఈ విషయం తల్లిదండ్రులకు తెలిసి, వాళ్ళు బాధపడకముందే, తెలివితేటలతో భర్తను మార్చుకోవాలి అనుకుంది.

హృదయంలో ఉన్న బాధంతా దిగమింగుకుని, లేనినవ్వు తెచ్చిపెట్టుకుంటూ అంది.

'ఈ ప్రేమలో కూడా మనిద్దరిమధ్య ఆ స్కూటరెందుకు బాబూ! — ప్రేమ కంట్లో నలుసులా. కొంచెం సేపు దాన్ని మర్చిపోదురూ' అంది.

'అయ్యయ్యో! ఎంత మాటన్నావ్? దాన్ని మర్చిపోతే యింకేమైనా ఉందా? గంధమంతా చెడిపోదూ?' అంటూ ఆమెను మరింత దగ్గరకు లాక్కున్నాడు శేఖరం.

తనను ఆప్యాయంగా చుట్టేసిన, భర్త చేతులలో యిమిడిపోతూ, 'ఇదంతా నిజం ప్రేమేనా? లేక స్కూటరు ప్రేమా?

అంది శారద.

శేఖరం గట్టిగా నవ్వేశాడు!

'భలేదానివే. స్కూటరు నాకొక్కడికే అనుకుంటున్నావా?— నీకోసమే రాణీగారు కాలు క్రింద పెడితే నేను చూడలేను.'

'నాకోసమైతే అక్కర్లేదులెండి. నేనేమీ కాలు క్రిందపెట్టి నడవలేనంత సుకుమారి నేం గాను.'

'అమ్మో! పాదాలు కందిపోతేనో??!'

'మరేం ఫరవాలేదు. ఆ భయమక్కర్లేదు. నా పాదాలు అంత సున్నితాలేం కావు—

'అబ్బ. ఎంతమంచి మనసండీ మీది! పెళ్లాం కందిపోతుందనీ, పాదాలు అరిగి పోతాయని భయమైతే, స్వంత డబ్బుతో స్కూటరు కొని ఎక్కించి తిప్పండి. అప్పుడు నాకూ సంతోషం.

'అయినా స్వంత డబ్బుతో కొని, భార్యను ఎక్కించి తిప్పినప్పడున్న తృప్తి మామగారి సొమ్ముతో కొన్నప్పు డుండదుగా?'

'ఏం ? మీవాళ్ళు ఆ మాత్రం యివ్వలేరేమిటి? వాళ్లమ్మాయికి యింత పెద్దాఫీసరు — మొగుడొచ్చినందుకైనా, మారు మాట్లాడకుండా ఆ మాత్రం కానుక యివ్వవచ్చునే!'

'అందుకనే, సరిపడా కట్నం యిచ్చారుగా.'

'కట్నం నాకిచ్చారేమిటి? మా వాళ్ళకిచ్చారు... ముచ్చటపడి స్కూటరడుగుతున్నాను. మీవాళ్ళూ మావాళ్ళూ ఏం లావాదేవీలు పడ్డారో నాకనవసరం. నేనడిగింది యిదొక్కటి.'

'ఇది మరీ బాగుంది. మీవాళ్లకు కట్నం మీకు కానుకలు అంటూ వేలకు వేలు గుమ్మరించడానికి యిక్కడ డబ్బులచెట్టేం లేదుగా...ఆడపిల్ల గలవాళ్ళం, స్వామి! ఏదో కొంచెం దయతలచండి' అంది నాటక ఫక్కీగా.

'దయతలచాం గాబట్టే ఇరవైలూ, ముప్ఫయిలూ కట్నాలొస్తే వదిలేసుకు పది వేలకు దిగాం...ఈమాత్రం చిన్నకోరికా తీర్చకపోతే, నీ పతిదేవుడికి రేపు నలుగురిలో ఇన్సల్ట్! గ్రేట్ ఇన్సల్ట్! డియర్.'

'సిగ్గు లేకపోతే సరి. ఇందాకగూడ మీ ఫ్రెండ్సు చేసినపనులు పెద్ద ఘనకార్యాల్లా

# అల్లుడూ ఒకనాడు...

చెప్పకొచ్చారు. కట్టుకున్న పెళ్ళాలను ఉస్సూరు మనిపించి, వాళ్లసుందర స్వప్నాలు అల్లకల్లోలం చేసి, కట్నభారాలతో కృంగి ఉన్న మామగార్లను మరింత బాధపెట్టి, అప్పుల్లో ముంచడం అదీ ఒక గొప్పేనా? పైగా పెద్ద ఘనకార్యం చేసినట్టు చెప్పకొస్తున్నారు. మీ ఫ్రెండ్సు, నాముందు అనాల్సింది చెప్తున్నా.'

'స్టాప్! స్టాప్! —లెక్చరు చాలా బాగుందిగాని, పాపం! అలసిపోయావు. కొంచెం మంచినీళ్లివ్వనా ?'

'స్కూటరు విషయంలో పట్టుదల వదిలేసుకోండి. నాకింకేం ఒద్దు. మంచి నీళ్ళిచ్చినంత పుణ్యం మీకు.'

శారద కళ్లలో నీళ్ళు గిర్రునతిరిగాయి. అతనికి కనబడనీకుండా ప్రక్కకు తిరుగుతూ అంది.

'పెళ్లిచేసి, ఖర్చుల భారంలో కృంగి ఉన్నారు మావాళ్ళు. ఇంకా తేరుకోనే లేదు. ఎలా అడగమంటారు ? వాళ్ల కష్టాలూ ఆలోచించాలిగా.'

'ఎంతసేపూ కష్టం! కష్టం! అంటూ అటుసైడే మాట్లాడ్తావు. కట్టుకున్నవాడి మనస్సుకూడ కొంచెం తెలుసుకో. నేనేం వజ్రవైడూర్యాలడిగానా ? మడిమాన్యాలు కావాలన్నానా ?'

శారద కళ్లనుంచి బొటబొటా నీళ్ళు రాలాయి. 'మీరు నన్ను అర్థం చేసుకోడం లేదు. ఆడపిల్లగా నాస్థితి ఒక్కసారి తలచుకోండి... మీకు నాకంటే స్కూటరే ఎక్కువన్నమాట.'

'పిచ్చిపిల్లా !' అంటూ దగ్గరకు తీసుకుని, కళ్ళు తుడిచాడు, శేఖరం. 'ఇంతే నన్నుమాట నన్నర్థం చేసుకున్నది' అన్నాడు.

'ఏమోమరి. ఏం చేసుకున్నానో ఏంలేదో నాకే తెలీడంలేదు. నాభర్త బాగా చదువుకున్నవారని, పెద్ద ఆఫీసరని తెలీగానే ఉప్పొంగిపోయాను. ఇన్నాళ్ల పరిచయంతో, ఎంతో సంస్కార వంతుడనీ, సహృదయుడనీ తెలుసుకుని మురిసిపోయాను. కాని... రోజులయితే మారాయిగాని, ఆనాటి అల్లుడికీ యీనాటి అల్లుడికీ మార్పు నాకేమీ కనబడంలేదు.'

'అంటే ?' ముఖం సీరియస్‌గా పెట్టి నుదురు చిట్లిస్తూ అడిగాడు.

'చిన్నప్పుడు మాబామ్మ చెప్తుండేది. అలకపానుపుమీద అడిగింది యివ్వలేదని, మా తాతయ్యావాళ్ళూ ఆవిడను రెండేళ్ల దాకా కాపరానికి తీసుకెళ్ళలేదట. చూడగా చూడగా దానికీ దీనికీ తేడాఏమిటో అనిపిస్తోంది.

కాదంటే ఆనాటి స్త్రీ అక్షరజ్ఞానం లేనిది. ఈనాటి ఆడపిలలా యిన్ని ఆలోచనలు పెట్టుకోకుండా 'కర్మ!' అని సరిపెట్టుకునేది.

చేతుల్లో ఉన్న శారదను చటుక్కున వదిలేసి, కొంచెం దూరంగా జరిగాడు శేఖరం.

'అంటే? — ఆనాటి సంస్కారంలేని ఆ మనుష్యులకూ, నాకూ తేడా లేదు. అంతేనా? వాళ్ళూ నేనూ ఒక్కలానే ఉన్నామన్న మాట. అదేగా నీ ఉద్దేశ్యం. సరే. ఇంక నీకు చెప్పేదేం లేదు.' అంటూ కోపంగా అటు తిరిగి పడుకున్నాడు శేఖరం

శారదకు నవనాడలూ కృంగినట్టయింది. అయినా ధైర్యం తెచ్చుకుంటూ నచ్చచెప్పబోయింది గాని, అతను వినిపించుకో లేదు.

నవ్వుతూ సరదాగానూ చిలిపిగానూ ఉండే మనిషి ఒక్కసారిగా సీరియస్‌గా మారిపోవడంతో, వైవాహిక జీవితంలో యీ రకం చేదు అనుభవించలేని శారద దిగాలు పడిపోయింది.

ముభావంగా ఉండడం, అడిగిన దానికే సమాధానం చెప్పడం, పెట్టిన టిఫిన్ను సగానికి పైగా తీసేయడం, ఏ పిండి వంటలు వడ్డించినా ఒద్దనడం—కాలేజీలో స్త్రీ పురుషుల సమానత్వం గురించి వాదించిన శారద, నిజజీవితంలో ఓడిపోయింది.

ఈ విషయం యింట్లో ఎలా చెప్పాలో తెలీదు భర్తచూస్తే తన అవస్థ అర్థం చేసుకోడంలేదు దిక్కుతోచని శారద అయోమయంలో పడింది.

భగవంతుడా! ఈయనా ఒకనాడు మామగారవుతాడు గదా! ఆ సత్యం తెలుసుంటే యిప్పడెందుకు యిలా ప్రవర్తించాలి? దేవుడనే వాడుంటే, యీాయనకి ఒక ఆడపిల్ల పుట్టి, అల్లుడువచ్చి, ఆ అల్లుడూ యిలా ఏడిపించుకు తిన్ననాడు ఆ కష్టం

తెలిసొస్తోంది; అనుకుంది శారద.

ఆడపిల్ల కన్నీటినుంచి వచ్చినమాట వృథాపోదు.

ఆ శారదే యీనాడు శారదాంబ అయింది.

ఆనాటి అల్లుడు శేఖరం, యీనాడు మరో అల్లుడికి మామగారు చంద్రశేఖరరావు గార్త్రై పోయారు.

కూతురు టిఫిను ప్లేటు వెనక్కి తెచ్చేస్తూంటే. చిన్ననాటి స్మృతులు కల బోస్తున్న శారదాంబగారు యీ లోకం లోకి వచ్చింది.

'అదేమిటి? టిఫిను తినలేదా అతను?' ఆదుర్దాగా అడగబోతూ మాటల్ని మధ్య లోనే ఆపేసింది చటుక్కున.

తనకుమాత్రం తెలీదూ? కళకళ లాడాల్సిన ఆముఖం చిన్నబోవడం, చిరు నవ్వులు చిలదించే తరణంలో, వయస్సుకి మించిన గాంభీర్యం – వాటినిచూస్తే అర్థంగావడంలేదూ? ఇవన్నీ తనకుమాత్రం తెలీని సంగతులా?

తను చూస్తే ఎక్కడ బాధపడు తుందోనని, నెమ్మదిగా పళ్ళెంతీసుకుని వంటింట్లోకి వెళ్ళిపోతున్న కూతురు, తనమాటలకి కంగారుపడి పోయింది. 'ఆ ఏమిటమ్మా? టిఫినా?... ఆకలిలేద టమ్మా ... ఒంట్లో బాగుండలేదేమో.?' కూతురు మాటల్లో తొట్రుపాటు చూస్తూంటే శారదాంబ హృదయం ద్రవించింది.

నిన్న మొన్నటిదాకా ఓణీల్లో చీకూ చింతా అంటే తెలీకుండా గడిపిన పిల్ల. కన్నెపిల్లగా కలలుకని, వాస్తవంలోకి వచ్చే సరికి, ఎదురవుతున్న కఠిన సమస్యలు ఎదుర్కోలేక సతమత మవుతోంది.

తనకోసం యింత ఖర్చు పెట్టిన తల్లి దండ్రులందు ఎక్కడలేని కృతజ్ఞతా ఒకవైపు, ఈ విషయం తెలిస్తే తల్లి దండ్రులు ఎక్కడ నొచ్చుకుంటారో అన్న బాధ మరోవైపు, భర్తకు చెప్పుకోలేక పోయినంత అసమర్థురాలినే అనే దిగులు మరికొంత—అన్నీ కలిసి కృంగదీసిన మనిషి ఎలా ఉంటుంది?

ఆ బాధ తనకూ తెలిసినదే. ఒకనాడు దాన్ని తనూ అనుభవించినదే:

ఆనాడూ యిలాగే తను దిగులుగా విచారంగా తిరగడం చూసి, వదిన గుచ్చి గుచ్చి అడిగింది. ఆఖరికి తప్పలేక, చెప్ప లేక చెప్పి ఏడ్చేసింది, తను. —'వదినా! నాకెందుకి పెళ్ళిచేశారు' అంటూ.

తను తల్లి! సాటి ఆడదానిగా అయినా, కూతురి హృదయంలో బాధ అర్థం చేసుకోలేదా?

ఆరాత్రి మంచినీళ్ళు తీసుకుని, గది లోకి వెళ్తున్న కూతురుతో అంది. 'డబ్బు గురించి నువ్వేం బెంగపెట్టుకోకు. ఆ విష యాలు—పెద్దవాళ్ళం మేము చూసు కుంటాంగా. నీకెందుకు దిగులు? మీరు సరదాగా ఉండండి.' అని.

తల్లికి తెలిసిపోయిందే అన్న ఆశ్చర్యం, ఆమె మాటల్లో వినిపిస్తున్న ఆప్యాయతకి ఆ అమ్మాయి కళ్ళు చమర్చాయి.

'పెద్దచదువులు చెప్పించారు. రిసెర్చి కూడ చేస్తానంటే ఒద్దని పెళ్ళిచేశారు. పెళ్ళిఖర్చులే తలకుమించిన భారమయ్యాయి. ఇంకా ఎక్కడ్నించి తెచ్చిస్తారమ్మా నాన్న గారు' అంది దిగులుగా.


'ఆనాటికంటే యీనాడు స్త్రీల పరిస్థితి మెరుగంటున్నారు: స్త్రీలకు పురుషులతో సమాన హక్కులొచ్చాయంటు న్నారు. ఎక్కడమ్మా? ఏవి? —కాలం అయితే మారిందిగాని, మనుష్యులు ఎక్కడ మారారమ్మా?' ఈ ప్రశ్నే పద్దెనిమి దేళ్ల క్రితం తనూ వేసుకుంది. కాని జవాబు—ఆనాడూ యీనాడూ ఒకటే అయింది.

చంద్రశేఖరం ఆఫీసునుంచి, బాగా తైరయిపోయి యింటికి వచ్చాడు. 'పాపా! కాసిని మంచినీళ్ళు తే' అంటూ కూతుర్ని కేకేసి, వచ్చి సోఫాలో కూర్చున్నాడు.

శారద మంచినీళ్లు తీసుకెళ్లి అతని కిచ్చింది. 'ఫేన్ పెట్టుకోకుండా కూర్చు రేం?' అంటూ ఫేన్ వేసింది.

అతని ముఖం చూడగనే అనుకున్న పని కాలేదని తెలిసింది. ఇంకేం అడగ్గలదు?

కాఫీ త్రాగుతూ కొంతసేపయాక అన్నాడు. 'ఏ రకంగా ప్రయత్నించినా డబ్బు సమకూడలేదు. ఇప్పుడేం జేయడం? నాకేం అర్థం గావడంలేదు శారదా! మతి పోతోంది' అన్నాడు భారంగా.



సంసారభారంలో కృంగి, నిస్సహాయుడిలా ఉన్న భర్తను చూసేసరికి శారద మనస్సంతా ఏదోలా అయిపోయింది.

'అల్లుడు డబ్బు కావాలని అడిగాడండి. కొత్త ఫియట్‌కి అప్లయి చేశా


మీకు సంతానం లేదా?



ఆపరేషన, యితర వ్యర్థప్రయాసముల చికిత్సలచే, విరాశచెందిన సోదరీమణులు, మా సలహా సంప్రదింపులచే, దేశములో పలుప్రాంతముల స్త్రీలు, సంతానవతులై పంపిన ప్రశంసా పత్రములనేకము గలవు. ఉచిత సలహా. వివరములకు:

**శ్రీనాగార్జున మూలికా కుటీరం**

రైల్వే స్టేషన్‌వద్ద — రామాలయం వీధి,
తెనాలి - 2.

ధరించడానికి తగినవస్త్రాలు?



**ట్విన్ టస్కర్**

డ్రిల్‌లు·పాప్లిన్‌లు·గాబర్డీన్‌లు
టస్సూర్‌లు మొదలైనవి

మధుర మిల్స్
మదురై, దక్షిణ ఇండియా.

Bensons-1841 B-TEL


## అల్లుడూ ఒకనాడు...

డట. గవర్నమెంటిచ్చే లోను చాలదుగా? పైడబ్బు కొంత మనల్ని సర్దుబాటు చెయ్యమన్నాడట.'

'కట్నమిచ్చాంగా. అందులోంచి తీసుకోండి' అందట మన కమల.

మాటామాటా వచ్చి ముఖం ఎత్తి పెట్టుకు తిరుగుతున్నాడతను. అన్నమూ సరిగ్గా తినడంలేదు. ఏవి పెట్టినా తీసి పడేస్తున్నాడు' అంటూ అంతకితం రోజు భర్తతో చెప్పింది శారద.

నెలకి పదహారువందలు జీతం వస్తోంది గాని, నెలాఖరయేసరికి డబ్బుకు తడుముకోవడం తప్పడంలేదు. ఇంటి ఖర్చులు, పిల్లల చదువులు, కారుకి తెచ్చిన డబ్బు తీర్చడం, ప్రావిడెంటుఫండు, ఇన్సూరెన్సులనీ, టాక్సు—అన్నీ పోయేసరికి చేతిలో కానీ నిలవడం లేదు. ఇవన్నీగాక పెళ్ళికి చేసిన అప్పుకొంత ఉండిపోయింది. నెల నెలా జీతంలోంచి తీసి యిచ్చేయడంలో భర్తకి నానా అవస్థా అయిపోయింది.

'ప్రైగా కట్నమిచ్చి సలక్షణంగా పెళ్ళి చేస్తే. ఇంకా డబ్బట! డబ్బు. తింటే తినమను. లేకపోతే పొమ్మను. కానీలేదు నా దగ్గర' అంటూ విరుచుకు పడ్డాడతను.

భర్త మాటలకి ముందు నవ్వొచ్చింది. 'కొంపతీసి అతను వినగలడు. అమ్మాయి విన్నా బాధపడుతుంది...ఇది మీ ఒక్కరి కన్న మాటేం? లోకరివాజు! ఆనాడు నానా గొడవచేసి మీరు స్కూటరు కొనిపించుకోలేదూ?' అంది.

అంతెత్తున ఎగిరిన మనిషి, చటుక్కున క్రిందకు దిగిపోయాడు.

ఆ మర్నాడు నోరెత్తి చెప్పకపోయినా, ఉదాసీనంగా తిరుగుతోన్న కూతుర్ని చూస్తే, అంతా అర్థమయింది, శేఖరానికి. భార్య సలహామీద డబ్బుకోసం ప్రయత్నం చేశాడు. కాని ఎక్కడా దొరక్కపోవడంతో మనిషి దిగాలుపడి పోయాడు.

'ఒక్కగా నొక్క ఆడపిల్లని దాన్ని మరీ ప్రాణంలా పెంచాము. ఏరి, కోరి, విదేశాల్లో చదివొచ్చిన అబ్బాయిగదాని, తాహతుకి మించిన కట్నమైనా, యిచ్చి పెళ్ళిచేశాను. అది కళకళ్ళాడుతూ తిరక్కపోతే ఏదోలా ఉంది. ఏంచేద్దాం శారదా! ఏదైనా సలహా చెప్పవూ?' అంటూ పసిపిల్లాడిలా, బేలగా అంటోన్న భర్తను చూసేసరికి, అల్లుడిమీద ఎక్కడలేని కోపం వచ్చింది; శారదకి

'ఏమల్లుడో! బుద్ధిమంతుడులా ఉన్నాడని కోరి చేసుకుంటే, కాల్చుకు తింటున్నాడు. ఇతనికీ ఒక ఆడపిల్ల పుట్టి, అల్లుడొచ్చి, ఆ అల్లుడూ యిలా'... చటుక్కున తెగిపోయాయి శారద ఆలోచనలు.

'ఒద్దు! ఒద్దు! ఈ అనుభవం నా కూతురికేకాదు; ఏ ఆడపిల్లకూ ఒద్దు.' అనుకుంది.

ఆనాడు పెళ్ళయిన క్రొత్తలో, స్కూటరుకోసం భర్త నిర్బంధిస్తోన్నప్పుడు, వ్యథిత హృదయంతో అనుకుంది. అతనూ ఒకనాడు మామగారయి, ఆ అల్లుడు ఒత్తిడి చేసినప్పుడు, ఆ కష్టమేమిటో తెలిసివచ్చునుగదా అని.

ఆడపిల్ల హృదయావేదన — కన్నీటి మధ్య నుంచివచ్చిన వాక్కు వృథా పోదేమో?

అక్షరాలా అదీనాడు నిజమయింది.

కాని జరిగిందేమిటి?

—ఆనాడు తల్లిదండ్రుల కష్టం చూసి ఆడపిల్లగా దిగులు చెందితే: యీనాడు భర్త పాట్లుచూసి, యిల్లాలుగా ఆవేదన చెందుతోంది.

అతని బాధ తనబాధ కాలేదా? ఆకూ—ముల్లూ సామెతలా ఏటుతిరిగినా ఆడదానికేగదా' అనుకుని, నిట్టూర్చింది శారదాంబగారు.

లేచివెళ్ళి, స్టీల్ అల్మరాతీసి, లాకర్లోంచి పెళ్ళినాటి చంద్రహారాలు, వడ్డాణ్ణం, గాజులు తెచ్చి భర్తచేతిలో పెట్టింది.

'శారదా! ఏమిటిది?' అన్నాడు శేఖరం విస్తుపోతూ.

శారద నవ్వింది. 'మరేం లేదు. అంత బంగారం పెట్టుకు తిరగడం ఫాషనూ కాదు; ఇంట్లో పడేసి ఉంచినా దొంగల భయమూను. ఇన్నాళ్ళకు వీటి అవసరం వచ్చింది. మరేమీ ఆలోచించక, అమ్మేసి డబ్బుతెచ్చి అమ్మాయికివ్వండి. ఆ కారేదో కొనేసుకుంటే అతని ముచ్చటా తీరిపోతుంది' అంది.